కాంగ్రెస్, బీజేపీకి బీఆర్ఎస్సే దిక్కు

- సొంత అభ్యర్థులను నిలబెట్టుకో లేని దైన్యం
- కొత్తగా చేరినోళ్లకే టికెట్లు ఇచ్చుకోవాల్సిన దౌర్భాగ్యం
- ఆ రెండు పార్టీల జాబితాలే నిదర్శనం

హైదరాబాద్, మార్చి 21 (నమస్తే తెలంగాణ): దేశంలో సుదీర్ఘకాలంపాటు అధికారంలో ఉన్న రెండు జాతీయ పార్టీలైన కాంగ్రెస్, బీజేపీ ఇప్పటికీ అన్ని నియోజకవర్గాల్లో తమ సొంత అభ్యర్థులను నిలబెట్టుకోలేని దుస్థితిని ఎదుర్కొంటున్నాయి. సుదీర్ఘ చరిత్ర ఉన్న ఆ పార్టీలు అన్ని నియోజకవర్గాల్లో బలమైన నాయకులను తయారుచేసుకోలేకపోయాయన్న విమర్శను చవిచూస్తున్నాయి. ఈ రెండు పార్టీలు రాష్ట్రంలోని 17 లోక్‌సభ స్థానాలకు బలమైన సొంత అభ్యర్థులు లేక బీఆర్ఎస్‌పైనే ఆధారపడుతున్నాయని జరుగుతున్న పరిణామాలు స్పష్టం చేస్తున్నాయి. బీజేపీ అభ్యర్థుల్లో బీజేపీ లేదా ఆ పార్టీ అనుబంధ సంఘాల్లో రాజకీయ ఓనమాలు దిద్దుకొని ఎదిగినవారెందరు? ఇటీవల కాలంలో ఇతర పార్టీల నుంచి వచ్చిన వారెంతమంది? ఇలా పార్టీలో చేరగానే అలా టికెట్లు దక్కించుకున్నవారెంతమంది? అనే చర్చ ఆసక్తిగా సాగుతున్నది. రాష్ట్రంలో కాంగ్రెస్ పార్టీదీ అదే పరిస్థితి.

బీఆర్ఎస్ సిట్టింగ్‌లకు గాలం

పార్లమెంట్ ఎన్నికల్లో తమకు సరైన అభ్యర్థులు లేకపోవడంతో బీఆర్ఎస్‌లోని ముఖ్యనేతలను ఆకర్షించేందుకు కాంగ్రెస్, బీజేపీ పోటాపోటీగా ప్రయత్నిస్తున్నాయి. బీఆర్ఎస్‌కు చెందిన ఐదుగురు సిట్టింగ్ ఎంపీలు బీబీ పాటిల్, రంజిత్‌రెడ్డి, పసునూరి దయాకర్, పోతుగంటి రాములు, వెంకటేశ్ నేతను కాంగ్రెస్, బీజేపీ తమ తమ పార్టీల్లో చేర్చుకున్నాయి. బీజేపీ ప్రకటించిన 15 మంది అభ్యర్థుల్లో ఏడుగురు (ఈటల రాజేందర్, బూర నర్సయ్యగౌడ్, కొండా విశ్వేశ్వర్‌రెడ్డి, బీబీ పాటిల్, అజ్మీరా సీతారాంనాయక్, సైదిరెడ్డి, రఘునందన్ రావు (పూర్వాశ్రమంలో బీజేపీతో సంబంధాలున్నా) బీఆర్ఎస్‌తో రాజకీయాల్లోకి వచ్చినవారే కావడం గమనార్హం. ఇందులో గతంలో, ప్రస్తుతం బీఆర్ఎస్‌ను వీడినవారున్నారు. బీజేపీ కండువా కప్పుకోగానే సీట్లు పొందిన నేతల్లో గోడం నగేశ్ (ఆదిలాబాద్), అజ్మీరా సీతారాంనాయక్ (మహబూబాబాద్), బీబీ పాటిల్ (జహీరాబాద్), పోతుగంటి భరత్ (ఎంపీ పోతుగంటి రాములు కుమారుడు, నాగర్‌కర్నూల్), సైదిరెడ్డి (నల్లగొండ) బీఆర్ఎస్ ద్వారా ఎదిగివచ్చిన నేతలే కావడం గమనార్హం. వీటితోపాటు వరంగల్ టికెట్‌ను కూడా బీఆర్ఎస్‌లో ఎదిగి, ఇటీవల బీజేపీలో చేరిన అరూరి రమేశ్‌కు కేటాయించినట్టు సమాచారం. కాంగ్రెస్ కూడా ఇటీవల బీఆర్ఎస్ నుంచి ఆ పార్టీ లో చేరిన రంజిత్‌రెడ్డి(చేవెళ్ల), దానం నాగేందర్(సికింద్రాబాద్), సునీతా మహేందర్‌రెడ్డి (మల్కాజిగిరి) టికెట్లు కేటాయించడం గమనార్హం. దశాబ్దాల చరిత్ర గల రెండు జాతీయ పార్టీలకు సరైన అభ్యర్థులే దొరకకపోడంతో బీఆర్ఎస్‌పై ఆధారపడటం చర్చనీయాంశంగా మారింది.

‘పుష్పక్ విమానం’ ప్రయోగానికి సిద్ధం

బెంగళూరు, మార్చి 21: రోదసి ప్రయాణాలు అత్యంత సులభతరం చేసేందుకు భారత అంతరిక్ష పరిశోధన సంస్థ (ఇస్రో) శుక్రవారం అత్యంత కీలకమైన ప్రయోగాన్ని చేపట్టింది. పునర్వినియోగ రాకెట్ ‘పుష్పక్ విమాన్’ను కర్ణాటకలోని రక్షణశాఖకు చెందిన ‘చాలకెరె రన్‌వే’ నుంచి ఉదయం 7 గంటలకు ప్రయోగించనున్నట్టు ఇస్రో తాజాగా వెల్లడించింది. అత్యంత సంక్లిష్టమైన ‘రొబోటిక్ ల్యాండింగ్’ సామర్థ్యాన్ని సాధించేందుకు ఈ ప్రయోగాన్ని ఇస్రో చేపడుతున్నది. ఈ సందర్భంగా ఇస్రో చైర్మన్ ఎస్ సోమనాథ్ మాట్లాడుతూ, ‘భవిష్యత్ పునర్వినియోగ లాంచ్ వెహికల్ (ఆర్ఎల్‌వీ) ఇది. రాకెట్ భూమిపైకి సురక్షితంగా చేరాక.. అందులోని అత్యంత ఖరీదైన ఎలక్ట్రానిక్ పరికరాల్ని తిరిగి వాడతాం’ అని చెప్పారు. ఆర్ఎల్‌వీ ప్రయోగాల్లో ఇస్రోకు ఇది మూడోది. 6.5 మీటర్ల పొడవు, 1.75 టన్నుల బరువుండే ‘పుష్పక్’ను ఆకాశంలో ఓ ఐఏఎఫ్ హెలికాప్టర్ నుంచి భూమిపై నిర్దేశిత లక్ష్యం వైపు ప్రయోగిస్తారు.

కాంగ్రెస్ జాబితాలో ఐదుగురికి చోటు

- మల్లు రవి, రంజిత్‌రెడ్డి, దానం, సునీతా మహేందర్‌రెడ్డి, వంశీ ఖరారు
- భట్టి విక్రమార్క సతీమణికి ఖమ్మం టికెట్ లేనట్టేనా?
- మల్కాజిగిరి నా ఇజ్జత్ కా సవాల్
- ముఖ్య నేతల భేటీలో సీఎం రేవంత్‌రెడ్డి

మల్లు రవి

హైదరాబాద్, మార్చి 21 (నమస్తే తెలంగాణ): ఏఐసీసీ గురువారం సాయంత్రం విడుదల చేసిన ఎంపీ అభ్యర్థుల జాబితాలో తెలంగాణ నుంచి ఐదుగురికి చోటు దక్కింది. వీరిలో చేవెళ్ల నుంచి గడ్డం రంజిత్‌రెడ్డి, మల్కాజిగిరి నుంచి సునీతా మహేందర్‌రెడ్డి, సికింద్రాబాద్ నుంచి దానం నాగేందర్, పెద్దపల్లి నుంచి గడ్డం వంశీ, నాగర్‌కర్నూల్ నుంచి డాక్టర్ మల్లు రవి ఉన్నారు. ఇందులో మల్లు రవి తప్ప మిగతా నలుగురూ ఇతర పార్టీల నుంచి వచ్చి కాంగ్రెస్‌లో చేరిన వారే కావడం గమనార్హం. గడ్డం రంజిత్‌రెడ్డి బీఆర్ఎస్‌కు చెందిన సిట్టింగ్ ఎంపీ కాగా, దానం నాగేందర్ ఖైరతాబాద్ బీఆర్ఎస్ సిట్టింగ్ ఎమ్మెల్యే. ఇక సునీతా మహేందర్‌రెడ్డి బీఆర్ఎస్‌కు చెందిన వికారాబాద్ జడ్పీ చైర్‌పర్సన్. పెద్దపల్లి ఎంపీ అభ్యర్థిగా ఖరారైన గడ్డం వంశీ గత అసెంబ్లీ ఎన్నికల ముందు తన తండ్రి, ప్రస్తుత చెన్నూర్ ఎమ్మెల్యే వివేక్ వెంకటస్వామితో కలిసి బీజేపీ నుంచి కాంగ్రెస్‌లోకి మారారు. మొదటి జాబితాలో నలుగురు, రెండో జాబితాలో ఐదుగురు అభ్యర్థులను ప్రకటించిన కాంగ్రెస్ మరో ఎనిమిది స్థానాలను పెండింగ్‌లో పెట్టింది. హోలీ పండుగ తరువాత మిగతా అభ్యర్థులను ప్రకటిస్తామని పీసీసీ అధ్యక్షుడు, సీఎం రేవంత్‌రెడ్డి తెలిపారు.

మల్కాజిగిరి గెలిచి తీరాల్సిందే: సీఎం

మల్కాజిగిరి లోక్‌సభ నియోజకవర్గంలో కాంగ్రెస్ అభ్యర్థి గెలుపు తనకు అత్యంత ప్రతిష్ఠాత్మకమని ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి పేర్కొన్నారు. తన సిట్టింగ్ ఎంపీ స్థానాన్ని ఎట్టి పరిస్థితుల్లోనూ గెలిచి తీరాల్సిందేనని పార్టీ నేతలకు దిశానిర్దేశం చేశారు. గురువారం ఉదయం ఆయన సునీతా మహేందర్‌రెడ్డితో కలిసి నియోజకవర్గ పరిధిలోని ముఖ్యనేతలతో తన నివాసంలో సమావేశమయ్యారు. మల్కాజిగిరి ఎంపీ అభ్యర్థిగా మొదట ప్రచారం జరిగిన సినీ నటుడు అల్లు అర్జున్ మామ కంచర్ల చంద్రశేఖర్‌రెడ్డి ఈ సమావేశానికి హాజరుకాకపోవడం గమనార్హం. సమావేశంలో రేవంత్‌రెడ్డి మాట్లాడుతూ.. మల్కాజిగిరి నుంచి గత ఎన్నికల్లో తాను ఎంపీగా గెలుపొందడం వల్లనే ముఖ్యమంత్రి అయ్యే అవకాశం లభించిందని చెప్పారు. కేంద్ర ప్రభుత్వంతో సఖ్యతగా ఉంటూ నియోజకవర్గ అభివృద్ధికి బాటలు వేద్దామని చెప్పారు.

కాంగ్రెస్ రెండో జాబితాలో టికెట్లు పొందిన అభ్యర్థులు

గడ్డం రంజిత్‌రెడ్డి	చేవెళ్ల
సునీతా మహేందర్‌రెడ్డి	మల్కాజిగిరి
దానం నాగేందర్	సికింద్రాబాద్
గడ్డం వంశీ	పెద్దపల్లి
డాక్టర్ మల్లు రవి	నాగర్‌కర్నూల్

భట్టి సతీమణికి టికెట్ రానట్టే

ఖమ్మం ఎంపీ టికెట్‌ను డిప్యూటీ ఉపముఖ్యమంత్రి మల్లు భట్టి విక్రమార్క సతీమణి నందినికి కేటాయించడం కష్టమనే అభిప్రాయం వ్యక్తమవుతున్నది. నాగర్‌కర్నూల్ టికెట్‌ను భల్లు భట్టి విక్రమార్క సోదరుడు మల్లు రవికి కేటాయించడంతో అదే కుటుంబానికి చెందిన నందినికి అవకాశం ఇవ్వకపోవచ్చని కాంగ్రెస్ వర్గాలు భావిస్తున్నాయి. గత అసెంబ్లీ ఎన్నికల్లో కాంగ్రెస్‌ను విజయతీరాలకు చేర్చడంతో తన వంతు పాత్ర పోషించిన మల్లు భట్టివిక్రమార్క చివరి వరకు ముఖ్యమంత్రి పదవి కోసం గట్టిగానే ప్రయత్నించారు. చివరకు రేవంత్ రెడ్డి వైపు మొగ్గుచూపిన అధిష్ఠానం భట్టి విక్రమార్కను బుజ్జగించి, ఉప ముఖ్యమంత్రి పదవిని కట్టబెట్టింది. తనకు ముఖ్యమంత్రి పదవి చేజారిపోయిన నేపథ్యంలో ఖమ్మం లోక్‌సభ నియోజకవర్గ టికెట్‌ను తన సతీమణి నందినికి ఇప్పించుకొనేందుకు భట్టి విక్రమార్క గట్టి ప్రయత్నాలే చేస్తున్నారు. పార్టీ టికెట్ కోసం దరఖాస్తు చేసుకొనే సందర్భంలో నందిని ఖమ్మం నుంచి హైదరాబాద్‌కు భారీ సంఖ్యలో కార్లతో ర్యాలీ నిర్వహించడం అప్పట్లో సంచలనం సృష్టించింది. మరోవైపు, ఖమ్మం జిల్లా రాజకీయాల్లో భట్టి విక్రమార్కను దెబ్బతీసేందుకు రేవంత్‌రెడ్డి అసెంబ్లీ ఎన్నికలకు ముందు నుంచే ప్రయత్నించారనే ప్రచారమూ జరిగింది. రాష్ట్రంలో కాంగ్రెస్ ప్రభుత్వం ఏర్పడిన తరువాత కూడా మల్లు భట్టి విక్రమార్కకు చెక్ పెట్టేందుకు, చిన్నబుచ్చేందుకు రేవంత్‌రెడ్డి ప్రయత్నిస్తున్నారనే విమర్శలూ ఉన్నాయి. ఈ నేపథ్యంలో నాగర్‌కర్నూల్ టికెట్‌ను మల్లు రవికి కేటాయించడంతో భట్టి విక్రమార్క సతీమణికి చెక్ పెట్టినట్టయిందని విశ్లేషకులు భావిస్తున్నారు. దీంతో రెవెన్యూ శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి సోదరుడు పొంగులేటి ప్రసాదరెడ్డికి మార్గం సుగమం అయిందని ఆయన వర్గం భావిస్తున్నది. ప్రస్తుతం ఖమ్మం టికెట్ పెండింగ్‌లో ఉండటంతో తన సతీమణికి టికెట్ ఇప్పించుకునేందుకు భట్టి విక్రమార్క ఏ వ్యూహం అనుసరిస్తారనేది ఆసక్తికరంగా మారింది.

24న రాష్ట్ర బంద్

బూటకపు ఎన్‌కౌంటర్‌కు నిరసనగా మావోయిస్టుల పిలుపు

హైదరాబాద్, మార్చి 21 (నమస్తే తెలంగాణ) : మహారాష్ట్ర-ఛత్తీస్‌గఢ్ సరిహద్దుల్లో ఇటీవల పోలీసులు జరిపిన బూటకపు ఎన్‌కౌంటర్‌ను నిరసిస్తూ రాష్ట్ర మావోయిస్టు పార్టీ ఈ నెల 24న బంద్‌కు పిలుపునిచ్చింది. ఈ మేరకు తెలంగాణ రాష్ట్ర మావోయిస్టు పార్టీ కమిటీ అధికార ప్రతినిధి జగన్ లేఖ విడుదల చేశారు. బూటకపు ఎన్‌కౌంటర్లన్నీ పోలీసు హత్యలేనంటూ పేర్కొన్నారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు కొనసాగిస్తున్న బూటకపు ఎన్‌కౌంటర్లపై వెంటనే హైకోర్టు న్యాయమూర్తితో విచారణ జరిపించాలని డిమాండ్ చేశారు. కామ్రేడ్ మంగు, వర్గేశ్, రాజు, బుద్రామ్‌లకు విషంపెట్టి, ప్రాణాలతో పట్టుకొని, క్రూరంగా హింసించి ఉదయం ఆరు గంటలకు కాల్చి చంపి.. ఎప్పటిలాగే ఎదురు కాల్పుల కట్టుకథ అల్లారని లేఖలో పేర్కొన్నారు.

ఖమ్మం ఎంపీ సీటు దక్కేదెవరికో?

- కాంగ్రెస్ ప్రధాన నేతల మధ్య హోరాహోరీ
- ఆశావహుల్లో డిప్యూటీ సీఎం సతీమణి, మంత్రి సోదరుడు, మరో మంత్రి కుమారుడు
- ఇంకా ఓ వ్యాపారవేత్త, ఓ సీనియర్ నేత, ఓ మీడియా సంస్థ అధినేత ప్రయత్నాలు

ఖమ్మం, మార్చి 21 (నమస్తే తెలంగాణ ప్రతినిధి): కాంగ్రెస్ నుంచి ఖమ్మం ఎంపీ టికెట్ ఎవరికి దక్కుతుందనేది ఆసక్తికరంగా మారింది. కొద్దినెలల క్రితం కాంగ్రెస్ అధినేత్రి సోనియాగాంధీ ఇక్కడినుంచి పోటీ చేస్తారనే ప్రచారం జరిగినప్పటికీ, ఆమె రాజ్యసభకు ఎన్నికవ్వడంతో ఆ అవకాశం లేదని తేలిపోయింది. ఖమ్మం టికెట్ కోసం భారీ సంఖ్యలో ఆశావహులు పోటీ పడుతున్నారు. జిల్లాలోని మధిర నియోజకవర్గం నుంచి 2009 నుంచి ప్రాతినిధ్యం వహిస్తున్న మల్లు భట్టివిక్రమార్క ప్రస్తుతం ఉప ముఖ్యమంత్రి హోదాతోపాటు కీలకమైన ఆర్థికశాఖ మంత్రిగా వ్యవహరిస్తున్నారు. అధిష్ఠానం వద్ద మంచిపేరు తెచ్చుకున్న భట్టి విక్రమార్క ఇప్పుడు తన సతీమణి నందినికి టికెట్ ఇప్పించుకునేందుకు తీవ్రంగా ప్రయత్నిస్తున్నారు. జిల్లాకే చెందిన మరో మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి సోదరుడు పొంగులేటి ప్రసాదరెడ్డి, సీనియర్ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు తనయుడు యుగేంధర్ కూడా రాజకీయాల్లోకి వచ్చేందుకు ఇదే అనువైన సమయమని భావిస్తూ టికెట్ దక్కించుకునేందుకు గట్టి ప్రయత్నాలే చేస్తున్నట్టు సమాచారం. వీరితోపాటు జిల్లాలో ప్రముఖ వ్యాపారవేత్తగా పేరున్న వంకాయలపాటి రాజేంద్రప్రసాద్‌తోపాటు కాంగ్రెస్ సీనియర్ నేత, మాజీ ఎంపీ వీ హనుమంతరావు (వీహెచ్) కూడా ప్రయత్నాలు కొనసాగిస్తున్నారు. ఇప్పటికే తనకు టికెట్ ఎందుకు ఇవ్వరంటూ వీహెచ్ కాంగ్రెస్ నేతలను ప్రశ్నించినట్టు వార్తలొచ్చాయి. మాజీ ఎమ్మెల్సీ పోట్ల నాగేశ్వరరావు కూడా తన ప్రయత్నాల్లో ఉన్నట్టు తెలుస్తున్నది. పార్టీ ఖమ్మం నగర అధ్యక్షుడు జావీద్‌కు టికెట్ ఇవ్వాలంటూ మైనార్టీ వర్గానికి చెందిన పలువురు నేతలు కొద్దిరోజులుగా ఖమ్మం జిల్లా కార్యాలయం ఎదుట ధర్నా చేస్తున్నారు. వీరితోపాటు జిల్లావాసి అయిన ఒక మీడియా సంస్థ అధినేత కూడా ఖమ్మం ఎంపీ టికెట్ కోసం తీవ్రంగా ప్రయత్నిస్తున్నట్టు జిల్లాలో చర్చ నడుస్తున్నది. ఢిల్లీ స్థాయిలో కూడా కాంగ్రెస్ ముఖ్య నేతలతో సత్సంబంధాలు ఉండటం, జిల్లాలో సామాజికవర్గ సమీకరణలు ఆయనకు కలిసొచ్చే అవకాశం ఉన్నదని పలువురు భావిస్తున్నారు. చివరకు పార్టీ అధిష్ఠానం ఎవరికి, ఏ ప్రాతిపదికన, ఏ సమీకరణలతో టికెట్ ఇస్తుందో చూడాలి మరి.

హెచ్ఎండీఏలో కృష్ణకుమార్ లీలలు

- టీడీఆర్ మోసాలపై ఏసీబీ నజర్

హైదరాబాద్, మార్చి 21 (నమస్తే తెలంగాణ) : హెచ్ఎండీఏలో అవినీతి జలగలపై ఏసీబీ ఫోకస్ పెట్టింది. సంచలనం సృష్టించిన శివబాలకృష్ణ వ్యవహారం విచారణ చేపడుతుండగానే అదే విభాగంలో మరో అధికారి లీలలు వెలుగులోకి వచ్చాయి. ట్రాన్స్‌ఫరబుల్ డెవలప్‌మెంట్ రైట్స్ (టీడీఆర్) పేరుతో హెచ్ఎండీఏ టౌన్‌ప్లానింగ్ అసిస్టెంట్ డైరెక్టర్ బీవీ కృష్ణకుమార్ భారీ మోసాలకు పాల్పడినట్టు ఏసీబీ గుర్తించింది. అతని చర్యల వల్ల ప్రభుత్వానికి ఏకంగా రూ.3,800 కోట్ల నష్టం జరిగినట్టు ఏసీబీ అంచనా వేసినట్టు విశ్వసనీయ సమాచారం. శివబాలకృష్ణ, కృష్ణకుమార్ కలిసే ఈ అక్రమాలకు పాల్పడ్డట్టు ప్రాథమికంగా అంచనాకు వచ్చారు.

విదేశాల్లో కృష్ణకుమార్

హెచ్ఎండీఏలో మాజీ డైరెక్టర్‌గా శివబాలకృష్ణ ఏసీబీకి చిక్కడంతోనే ముందస్తుగా కృష్ణకుమార్ అమెరికాకు వెళ్లిపోయినట్టు తెలిసింది. ఎలాగైనా తనపేరు బయటికి వస్తుందనే భయంతో విదేశాల్లోనే తలదాచుకున్నట్టు సమాచారం. బడా బిల్డర్ల ప్రాజెక్టులో టీడీఆర్ వాల్యూ భారీగా తగ్గించి బిల్డర్లకు లబ్ధి చేకూర్చిన వారిలో కృష్ణకుమార్‌తో పాటు మరో ఇద్దరు టౌన్‌ప్లానింగ్ అధికారులు ఉన్నట్టు ఏసీబీ గుర్తించింది. వీరంతా కలిసి ఇబ్బడిముబ్బడిగా బిల్డింగులకు అనుమతులు ఇచ్చారని సమాచారం. దీంతో ప్రభుత్వానికి వేల కోట్ల నష్టం వాటిల్లినట్టు అధికారులు గుర్తించారు. అయితే, గతంలోనే కృష్ణకుమార్‌ను ప్రభుత్వం సస్పెండ్ చేసింది. ఇప్పుడు వేల కోట్ల వ్యవహారం బయటికి పొక్కడంతో కృష్ణకుమార్‌ను హైదరాబాద్‌కు రప్పించేందుకు ఏసీబీ ఏర్పాట్లు చేస్తున్నట్టు తెలిసింది.

మనిషికి పంది కిడ్నీ మార్పిడి

వాషింగ్టన్, మార్చి 21: ప్రపంచంలోనే తొలిసారి ఓ సజీవ రోగికి పంది కిడ్నీ మార్పిడి జరిగింది. అమెరికాలో జరిగిన ఈ సర్జరీ విజయవంతమైనట్టు అక్కడి వైద్యులు తెలిపారు. కిడ్నీ సమస్యతో బాధపడుతున్న ఓ రోగికి పంది కిడ్నీని అమర్చినట్టు మసాచుసెట్స్ దవాఖానా వెల్లడించింది. 62 ఏండ్ల రోగి రెండు కిడ్నీలు ఫెయిలవ్వటంతో శనివారం అతనికి పంది కిడ్నీని మార్పిడి చేశారు.

నేషనల్ బుక్ ట్రస్టు ఈసీ మెంబర్‌గా వల్లీశ్వర్

హైదరాబాద్, మార్చి 21, (నమస్తే తెలంగాణ): సీనియర్ జర్నలిస్ట్ జీ వల్లీశ్వర్ నేషనల్ బుక్ ట్రస్టు ఎగ్జిక్యూటివ్ కమిటీలో సభ్యుడిగా, సంస్థ ట్రస్టీగా నియమితులయ్యారు. ఈ మేరకు నేషనల్ బుక్ ట్రస్ట్ డైరెక్టర్ యువరాజ్ మాలిక్ గురువారం ఉత్తర్వులిచ్చారు. మూడేండ్ల పాటు ఆయన పదవిలో కొనసాగనున్నారు. సీనియర్ జర్నలిస్ట్ అయిన వల్లీశ్వర్ ఆంధ్రపత్రిక, ఈనాడు, న్యూస్ టైమ్ పత్రికల్లో, భారత్ టుడే చానల్లో ఉన్నతస్థాయిలో పనిచేసి, నాటి దివంగత సీఎం వైఎస్ రాజశేఖర్‌రెడ్డి వద్ద చీఫ్ పీఆర్వోగా, ఆంధ్రప్రదేశ్ పత్రిక ఎడిటర్‌గా సేవలందించారు. ప్రస్తుతం ఎమెస్కో ప్రచురణ సంస్థలో కీలక బాధ్యతల్లో ఉన్నారు.

పంచాయతీ కార్మికులకు పెండింగ్ వేతనాలివ్వాలి

సీఐటీయూ నేతల డిమాండ్

హైదరాబాద్ / హిమాయత్‌నగర్,మార్చి21: రాష్ట్రవ్యాప్తంగా 12,769 గ్రామ పంచాయతీలలో పనిచేసే 52వేల మంది కార్మికులకు ఏడు నెలలుగా బకాయి పడ్డ వేతనాలను తక్షణమే విడుదల చేయాలని తెలంగాణ గ్రామ పంచాయతీ ఎంప్లాయీస్, వర్కర్స్ యూనియన్ గౌరవ అధ్యక్షుడు పాలడుగు భాస్కర్ ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. గ్రామ పంచాయతీ కార్మికుల సమస్యలను పరిష్కరించాలని డిమాండ్ చేస్తూ గురువారం హిమాయత్‌నగర్‌లోని తెలంగాణ కమిషనర్ పంచాయతీరాజ్, గ్రామీణ ఉపాధి కల్పన కార్యాలయం ముందు తెలంగాణ గ్రామ పంచాయతీ ఎంప్లాయీస్, వర్కర్స్ యూనియన్ ఆధ్వర్యంలో ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. వంద రోజుల కాంగ్రెస్ పాలనలో ప్రజలకు ఒరిగిందేమీ లేదని విమర్శించారు. ధర్నా అనంతరం సీఐటీయూ, యూనియన్ నేతలు డిప్యూటీ కమిషనర్ రామారావుకు వినతి పత్రం అందించారు. కార్యక్రమంలో యూనియన్ రాష్ట్ర అధ్యక్షుడు గ్యార పాండు, ప్రధానకార్యదర్శి చాగంటి వెంకటయ్య, నాయకులు గణపతిరెడ్డి, సుధాకర్, యాదమ్మ, వినోద్ కుమార్, మహేశ్,మల్లేశ్ తదితరులు పాల్గొన్నారు.

కార్పొరేషన్ పదవులు.. తూచ్!

- ‘కోడ్’రోజు హడావుడిగా పేర్లు లీక్
- ఒక్కరికీ ఆర్డర్ కాపీ ఇవ్వని ప్రభుత్వం
- ఎన్నికల్లో పనిచేయించుకునే ఎత్తుగడ
- మూడు నెలల తర్వాత సగం మందికి మొండిచేయి

హైదరాబాద్, మార్చి 21 (నమస్తే తెలంగాణ): గుర్రం కండ్లకు గంతలు కట్టడం గురించి తెలుసా.. గుర్రం దృష్టి మొత్తం ముందువైపే ఉంచి, మనకు కావాల్సినట్టుగా పరిగెత్తేలా వేసే ఎత్తుగడ ఇది. రాష్ట్ర ప్రభుత్వం, కాంగ్రెస్ పార్టీ ఇప్పుడు అచ్చం అలాంటి ఎత్తుగడే వేశాయి. ఎన్నికల వేళ ముఖ్య నేతలు పక్క చూపులు చూడకుండా వారి కండ్లకు ‘కార్పొరేషన్ పదవులు’ అనే గంతలు కట్టాయి. ఇదంతా ఎన్నికల స్టంట్ మాత్రమే అన్నది సస్పష్టం. బయటకు వచ్చిన 37 పేర్లన్నీ లీకులు మాత్రమే. ఫలానా వారికి ఫలానా కార్పొరేషన్ పదవి అంటూ గంపగుత్తగా ఒక జాబితాను లీక్ చేసి చేతులు దులుపుకున్నారు. కానీ ఇప్పటి వరకు ఏ ఒక్కరికీ అధికారికంగా చైర్మన్ పదవి ఇవ్వలేదు. కనీసం ఇప్పటివరకు ఒక్క జీవో కూడా విడుదల కాలేదు. ఎవరూ పదవీ బాధ్యతలు చేపట్టలేదు. కనీసం ఒక్కరికి కూడా ప్రొటోకాల్ లేదు. ‘మాకు పదవి వచ్చిందంట’ అని సంబర పడటానికి, అనుచరులు, బంధుగణంతో చప్పట్లు కొట్టించుకొని, శాలువాలు కప్పించుకోవడానికి తప్ప మరెందుకూ పనికిరాదని రాజకీయ విశ్లేషకులు స్పష్టం చేస్తున్నారు.

రాజకీయంగా వాడుకోవడానికే..

కాంగ్రెస్‌కు గాలివాటంగా అధికారం వచ్చిందనేది మొదటి నుంచీ ఉన్న వాదన. అధికారంలోకి వచ్చినా, 100 రోజులు గడుస్తున్నా ఇప్పటికీ రాష్ట్రవ్యాప్తంగా కాంగ్రెస్‌కు క్షేత్రస్థాయిలో బలం పెరగలేదు. పార్టీ, ప్రభుత్వం అంతర్గతంగా నిర్వహించిన నియోజకవర్గాల వారీ సర్వేలు, ఫ్లాష్ సర్వేల్లోనూ ఇదే తేలినట్టు చెప్పుకుంటున్నారు. అందుకే ఆ పార్టీకి అనేక నియోజకవర్గాల్లో అభ్యర్థులు దొరుకని పరిస్థితి. దీంతో బీఆర్ఎస్ నుంచి సిట్టింగ్ ఎంపీలు, ఇతర నేతలను టికెట్ ఇస్తామని చేర్చుకొంటున్నారు. అభ్యర్థులు దొరుకుతున్నా.. గ్రామస్థాయి నుంచి జిల్లా స్థాయి వరకు ఉన్న నేతలు ఉత్సాహంగా పనిచేయడం లేదని పార్టీ పెద్దల దృష్టికి వచ్చిందట. అభ్యర్థులను ఇతర పార్టీల నుంచి తెచ్చుకుంటున్నట్టే.. నామినేటెడ్ పదవులు కూడా పక్క పార్టీల వారికి కట్టబెడుతారని పెద్ద ఎత్తున ప్రచారం మొదలైంది. దీంతో వారిని రాజకీయంగా వాడుకోవాలని ‘కార్పొరేషన్ పదవులు’ అనే ఎరను సిద్ధం చేశారని చెప్పుకుంటున్నారు. వాస్తవానికి నెల రోజుల నుంచే కార్పొరేషన్ పదవులు ప్రకటిస్తారని ప్రచారం ఉంది. కానీ పుణ్యకాలం గడిచిపోయిన తర్వాత ఎన్నికల కోడ్ విడుదలైన తర్వాత కేవలం ఒక జాబితాను లీక్ చేశారు. అంతే తప్ప.. అధికారికంగా ఎలాంటి జీవోలు విడుదల కాలేదు. ఎన్నికల్లో వారిని వినియోగించుకునేందుకు మాత్రమే ఈ జాబితా బయటికి వచ్చిందని నిపుణులు స్పష్టం చేస్తున్నారు. జూన్ 6వ తేదీ వరకు ఎవరూ ప్రమాణ స్వీకారం చేయలేరని చెప్తున్నారు. అప్పటికి ఈ జాబితాలో సగానికిపైగా పేర్లు మారడం ఖాయమని గుసగుసలు వినిపిస్తున్నాయి.

మా చాంబర్ ఎక్కడ? జీతం ఎంత?

కార్పొరేషన్ చైర్మన్లుగా నియమితులైన నేతలు సచివాయంలో, ఆయా కార్పొరేషన్ల చుట్టూ ప్రదక్షిణలు చేస్తున్నారు. ‘మా చాంబర్ ఎక్కడుంది? ఎంత జీతం ఇస్తారు? కారు, పీఏ వంటివి ఏయే వసతులు ఉంటాయి?’ వంటి వివరాలు ఆరా తీస్తున్నట్టు అధికారులు చెప్తున్నారు. మాకు గన్‌మెన్లను ఇస్తారా? ఎంత మందిని ఇస్తారు? వంటివి కూడా ఆరా తీశారట. కొంద రైతే ఏకంగా తమ చాంబర్‌లో ఏమేం కావాలో మార్పులు-చేర్పులు కూడా సూచిస్తున్నట్టు తెలిసింది. దీంతో అధికారులు తలలు పట్టుకుంటున్నారు.



టెక్స్ట్ రూపంలో.. వాయిస్ మెసేజ్

త్వరలో వాట్సాప్‌లో కొత్త ఫీచర్

న్యూఢిల్లీ, మార్చి 21: వాట్సాప్‌లో ఒక్కోసారి అత్యవసరంగా ‘వాయిస్’ రూపంలో సందేశాన్ని పంపుతాం. స్నేహితుడు లేదా ఆఫీస్‌లో పై అధికారికి అత్యవసరంగా ఓ వాయిస్ మెసేజ్‌ను పంపాల్సి వచ్చినప్పుడు, ఆ సందేశాన్ని చూసి.. దానిని ఓపెన్ చేయకపోతే, అందులోని విషయం తెలుసుకునే అవకాశం లేదు. దీనికి పరిష్కారంగా వాట్సాప్ తీసుకొచ్చిన సరికొత్త ఫీచర్ వాయిస్ మెసేజ్‌ను.. టెక్స్ట్ ఫార్మాట్‌లోకి మార్చటం. ఈ ఫీచర్ తొలుత ‘ఐవోఎస్ ఆపరేటింగ్ సిస్టం’ ఉన్న యాపిల్ ఫోన్లలో ఇప్పటికే ప్రవేశపెట్టారు. యాపిల్ ఫోన్లలో ఈ ఫీచర్ విజయవంతం కావటంతో, ఆండ్రాయిడ్ ఫోన్లలోనూ తీసుకురావటంపై పరీక్షలు మొదలయ్యాయి. ఆండ్రాయిడ్ యూజర్లకు కూడా ఈ కొత్త ఫీచర్ పరిచయం చేసేందుకు వాట్సాప్ ప్రయత్నిస్తున్నదని టెక్ వర్గాలు వెల్లడించాయి. టెక్స్ట్ రూపంలో పరస్పర సందేశాలను ఇష్టపడే వ్యక్తులకు ప్రత్యామ్నాయ సమాచార మార్గంగా ఇది నిలుస్తుందని వాట్సాప్ వర్గాలు భావిస్తున్నాయి.



ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డిని కలిసి వినతి పత్రం సమర్పిస్తున్న ఎమ్మెల్సీ, రాష్ట్ర కురుమ సంఘం అధ్యక్షుడు యెగ్గె మల్లేశం. చిత్రంలో మంత్రి కోమటి రెడ్డి వెంకటరెడ్డి

ప్రత్యేక కురుమ కార్పొరేషన్ కావాలి: యెగ్గె మల్లేశం

హైదరాబాద్, నమస్తే తెలంగాణ/అబిడ్స్, మార్చి 21: కురుమల కోసం ప్రత్యేక కురుమ కార్పొరేషన్‌ను ఏర్పాటు చేయాలని ఎమ్మెల్సీ, రాష్ట్రకురుమ సంఘం అధ్యక్షుడు యెగ్గె మల్లేశం కోరారు. గురువారం మంత్రి కోమటిరెడ్డి, విప్ బీర్ల ఐలయ్యతో కలిసి సీఎం రేవంత్‌రెడ్డిని మల్లేశం కలిశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గొల్ల కురుమ కార్పొరేషన్ నుంచి కురుమలను వేరు చేసి ప్రత్యేక కురుమ కార్పొరేషన్ ఏర్పాటు చేయాలని కోరారు. కురుమలు బీసీ బీ జాబితాలోకి వస్తారని, యాదవులు బీసీ డీ జాబితాలోకి వస్తారని తెలిపారు. రాష్ట్రంలో యాదవులతో పోలిస్తే కురుమల జనాభా అధికంగా ఉంటుందన్నారు.

మంత్రి పొన్నంను సన్మానిస్తున్న బీసీ రాజ్యాధికార సమితి నేతలు

పదవుల్లో బీసీలకు ప్రాధాన్యమివ్వండి

మంత్రి పొన్నం ప్రభాకర్‌కు బీసీ రాజ్యాధికార సమితి వినతి

హైదరాబాద్, మార్చి21 (నమస్తే తెలంగాణ): నామినేటెడ్ పదవుల్లో బీసీలకు ప్రాధాన్యత కల్పించాలని బీసీ రాజ్యాధికార సమితి డిమాండ్ చేసింది. అలాగే ప్రజా ఉద్యమ సంఘాలు, సివిల్ సొసైటీ నాయకులను సైతం పరిగణనలోకి తీసుకోవాలని కోరింది. గురువారం సమితి రాష్ట్ర అధ్యక్షుడు దాసు సురేశ్‌తోపాటు పలువురు మంత్రి పొన్నం ప్రభాకర్‌ను కలిశారు. పదవులన్నీ ఒకే సామాజిక వర్గానికి పరిమితం అవుతున్నాయని సమితి నాయకులు ఆవేదన వ్యక్తం చేశారు. కార్యక్రమంలో బీసీ రాజ్యాధికార సమితి గౌరవ అధ్యక్షులు ఆనందం, తులసీ శ్రీమన్, ఊర్మిళ, స్వామి, వీరాస్వామి యాదవ్, లక్ష్మణ్, కృష్ణలత పాల్గొన్నారు.

బరాజ్‌ల డిజైన్లు ఇవ్వండి

- మార్గదర్శకాలను పాటించారా?
- సీడీవోకు ఎన్డీఎస్ఏ ప్రశ్నలు
- రెండో రోజూ విచారణ.. వివిధ విభాగాలతో భేటీ



హైదరాబాద్, మార్చి 21 (నమస్తే తెలంగాణ): మేడిగడ్డతోపాటు, అన్నారం, సుందిళ్ల బరాజ్‌లకు సంబంధించిన డిజైన్లను సీడీవోనే రూపొందించారా? ఎవరి ప్రమేయమైనా ఉందా? సీడబ్ల్యూసీ మార్గదర్శకాలను పాటించారా? షీట్ ఫైల్స్, సీకెంట్ ఫైల్స్‌ను వాడాలని ఎవరు నిర్ధారించారు? ఎలాంటి లోపాలను గుర్తించారు? అంటూ సెంట్రల్ డిజైన్ ఆర్గనైజేషన్ అధికారుల(సీడీవో)ను నేషనల్ డ్యామ్ సేఫ్టీ అథారిటీ (ఎన్డీఎస్ఏ) నిపుణులు ప్రశ్నించారు. మేడిగడ్డ బరాజ్ కుంగుబాటుతోపాటు, మిగిలిన రెండు బరాజ్‌లలో సాంకేతిక సమస్యలను పరిశీలించి, వాటి పరిష్కారానికి చేపట్టాల్సిన పునరుద్ధరణ చర్యలపై సిఫారసు చేసేందుకు నియమించిన చంద్రశేఖర్ అయ్యర్ నేతృత్వంలోని ఎన్డీఎస్ఏ నిపుణుల కమిటీ చేపట్టిన విచారణ గురువారం సైతం కొనసాగింది. ఎన్డీఎస్ఏ బృందం జలసౌధలో తొలుత సీడీవో అధికారులతో భేటీ అయింది. బరాజ్‌ల నిర్మాణ సమయంలో సీడీవోలో పనిచేసిన ఎస్ఈలు, డీఈఈలపై ప్రశ్నల వర్షం కురిపించింది. ప్రతి బరాజ్ డిశ్చార్జి కెపాసిటీ, ఇన్‌ఫ్లో, అవుట్ ఫ్లో పరిమాణం, మేడిగడ్డకు సంబంధించి షీట్ ఫైల్స్‌ను ఎందుకు వాడలేదు? అన్నారం, సుందిళ్ల బరాజ్‌ల డిజైన్లలో తేడాలు ఎందుకున్నాయి? తదితర అంశాలకు సంబంధించిన వివరాలను అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా అన్నారం, సుందిళ్ల బరాజ్‌ల డిజైన్లను తామే రూపొందించామని, మేడిగడ్డ బరాజ్ డిజైన్‌ను మాత్రం నిర్మాణ ఏజెన్సీనే రూపొందించిందని సీడీవో అధికారులు వెల్లడించినట్టు తెలిసింది. బరాజ్‌లకు సంబంధించిన ఒరిజనల్ డిజైన్లను అందజేయాలని ఎన్డీఎస్ఏ కోరగా, వాటిని విజిలెన్స్ అధికారులు తీసుకెళ్లారని బదులిచ్చినట్టు తెలిసింది. విచారణ అనంతరం డిజైన్లకు సంబంధించి సీడబ్ల్యూసీ మార్గదర్శకాలను పాటించారా? నిర్వహించిన పరీక్షలు? డిజైన్ల రూపకల్పనలో పరిగణనలోకి తీసుకున్న అంశాలు, టెక్నో ఎకనామిక్ రేషియో తదితరమైన 9 సాంకేతిక అంశాలకు సంబంధించిన ఒక ప్రశ్నావళిని సీడీవో అధికారులకు అందజేశారు. ఆయా అంశాలకు సంబంధించిన సమగ్ర వివరాలను, డిజైన్లను అదే నిర్దేశిత ఫార్మాట్‌లో అందజేయాలని ఆదేశించారు.

నాణ్యతను ఎలా నిర్ధారించారు..?

ఆ తరువాత ఎన్డీఎస్ఏ బృందం మూడు బరాజ్‌లకు సంబంధించిన నిర్మాణ ఏజెన్సీలు, ఇన్వెస్టిగేషన్, క్వాలిటీ కంట్రోల్ అధికారులతో భేటీ అయ్యింది. నిర్మాణం చేపట్టే ముందు నిర్వహించిన భూగర్భ పరీక్షలు, ఉపయోగించిన మెటీరియల్‌ను, నాణ్యత నిర్ధారణ తదితర అంశాలకు సంబంధించిన నివేదికలు, నిర్మాణ సమయంలో దశలవారీగా తీసిన ఫొటోలు తీసుకున్నారు.

ఓఅండ్ఎం నివేదికలివ్వండి..?

ఎన్డీఎస్ఏ బృందం ఆపరేషన్స్ అండ్ మెయింటెనెన్స్ అధికారులతో ప్రత్యేకంగా భేటీ అయ్యింది. మూడు బరాజ్‌లకు సంబంధించి అనేక అంశాలను అడిగి తెలుసుకున్నది. ఓఅండ్ఎంకు సంబంధించిన రికార్డులను అందజేయాలని అధికారులను ఆదేశించింది. ముఖ్యంగా 2019లో మేడిగడ్డ బరాజ్ వద్ద గుర్తించిన సమస్యలపై ఎక్కువగా వివరాలను సేకరించినట్టు సమాచారం.

అడవుల సంరక్షణ అందరి బాధ్యత

రాష్ట్రంలో అటవీ విస్తీరణం పెంపునకు కృషి: మంత్రి సురేఖ

హైదరాబాద్, మార్చి 21 (నమస్తే తెలంగాణ): అడవులను సంరక్షించుకోవాల్సిన బాధ్యత అందరిపైనా ఉన్నదని అటవీ శాఖ మంత్రి కొండా సురేఖ చెప్పారు. ప్రపంచ అటవీ దినోత్సవాన్ని పురస్కరించుకొని గురువారం కొండా సురేఖ మాట్లాడుతూ ‘మానవాళి మనుగడకు, భవిష్యత్ తరాల బాగు కోసం అడువులను సంరక్షించుకోవాలి. ఇది అందరి బాధ్యత. ఈ బాధ్యతను గుర్తుచేయడానికి ప్రతి సంవత్సరం మార్చి 21న ప్రపంచ అటవీ దినోత్సవాన్ని జరుపుకుంటున్నాం. పరిశ్రమల స్థాపన, ప్రాజెక్టులు, పట్టణాలు విస్తరించడం వల్ల అటవీ విస్తీరణం రోజురోజుకు తగ్గిపోతున్నది. అటవీ విస్తీరణం పెరుగుదలపై దృష్టిసారిస్తూ ఉన్న అడవులను రక్షించుకుందాం’ అని పిలుపునిచ్చారు.